Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

శనివారం
19 అక్టోబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 162
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

మేడ్చల్

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar

## మూసీ నీళ్లతో స్నానం చేసేలా...
## తాగేలా బాగు చేస్తాం

- స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.2 లక్షలు ఇస్తున్నామన్న సీతక్క
- 172 స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.3.44 కోట్ల రుణాలు ఇస్తున్నట్లు వెల్లడి
- ఇందులో రూ.1.4 లక్షలు ఉచితంగా ఇస్తున్నామన్న మంత్రి



**శుభ తెలంగాణ హైదరాబాద్**

మూసీ నీళ్లతో స్నానం చేసేలా, తాగేలా తాము బాగు చేస్తామని మంత్రి సీతక్క అన్నారు. మూసీ పరీవాహక స్వయం సహాయ సంఘాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చెక్కులను సీతక్క పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మూసీ నది ప్రక్షాళనపై ప్రతిపక్షాల నుంచి వస్తోన్న విమర్శలపై స్పందించారు. మూసీ పరీవాహక స్వయం సహాయ సంఘాల మహిళలకు తాము చేయూతనిస్తున్నామన్నారు. 172 స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.3.44 కోట్ల రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. మనం - మిగతా3లో

## తెలంగాణ ప్రభుత్వానికి గౌతమ్ అదానీ
# భారీ విరాళం



- స్కిల్ యూనివర్సిటీ కోసం... రేవంత్ రెడ్డికి రూ.100 కోట్ల విరాళం అందించిన అదానీ
- అదానీ ఫౌండేషన్ తరపున ఈ మొత్తాన్ని అందించిన అదానీ గ్రూప్ అధినేత
- కార్యక్రమంలో పాల్గొన్న సీఎస్ శాంతికుమారి, ఇతర అధికారులు
- రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలోని బేగరికంచెలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు

**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలంగాణలో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ భారీ విరాళం ప్రకటించారు. ఈ నేపథ్యంలో అదానీ ఫౌండేషన్ తరఫున శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డిని కలిసి 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి రూ.100 కోట్ల చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ తదితరులు సహా పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ సీఎం కార్యాలయం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ప్రకటించింది. యువతలో నైపుణ్యం పెంచేలా రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలోని బేగరికంచెలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ స్కిల్ యూనివర్సిటీలో 17 రకాల కోర్సుల్లో యువతకు శిక్షణను ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ప్రతి ఏడాది లక్ష మందికి శిక్షణ ఇచ్చేలా రానున్న - మిగతా3లో



## శిక్షించినా బాల్య వివాహాలు ఆగడంలేదు

- కమ్యూనిటీలో మార్పు రావాలి: సుప్రీంకోర్టు
- బాల్య వివాహాల కట్టడికి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు
- బాల్య వివాహాల నిరోధక చట్టం అమలుకు వ్యక్తిగత చట్టాలు అడ్డంకి కారాదన్న న్యాయస్థానం
- సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, మనోజ్ మిశ్రా, జేబీ పార్థీవాలాతో కూడిన ధర్మాసనం కీలక ఆదేశాలు
- బాల్యంలో పెళ్లి చేస్తే, జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛను హరించినట్లేనన్న కోర్టు

## మరోసారి రష్యా పర్యటనకు ప్రధాని మోదీ

- నాలుగు నెలల్లో రెండోసారి
- ఈనెల 22 నుంచి 24 వరకూ జరగనున్న 16వ బ్రిక్స్ సమ్మిట్‌లో పాల్గొననున్న మోదీ
- ఈ ఏడాది జులై 8 -9 తేదీల్లో ఆయన రష్యాలో పర్యటించిన విషయం తెలిసిందే





## యూనివర్సిటీలకు వీసీల నియామకం

ఓయూ వైస్ ఛాన్సలర్‌గా కుమార్

తొమ్మిది వర్సిటీలకు కొత్త వీసీల నియామకం

పాలమూరు యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

కాకతీయ వర్సిటీ వీసీగా ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి

తెలుగు యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ యాదగిరి రావు నియామకం

తెలంగాణలోని తొమ్మిది యూనివర్సిటీలకు కొత్త వైస్ ఛాన్సలర్లను నియమిస్తూ తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉత్తర్వులు జారీ చేశారు.




# మూటల కోసమే మూసీ

- ఢిల్లీ కోసమే సీఎం డ్రామా.. దేశంలోనే ఇది అతిపెద్ద స్కాం: కేటీఆర్
- కాంగ్రెస్‌కు ఏటీఎంలా మూసీ.. వాటాలపై రాహుల్ స్థాయిలో చర్చలు
- అందుకోసమే ప్రాజెక్టు అంచనా వ్యయం అమాంతం పెంపు
- ఆరు గ్యారెంటీల అమలుకు లేని పైసలు మూసీకి ఎట్లొస్తయ్?
- సుందరీకరణ, లక్షన్నరకోట్లు అన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఉల్టా ఎవరన్నరని అంటున్నడు.. ఆయన మానసికస్థితి బాగుందా?
- ముఖ్యమంత్రి ప్రజెంటేషన్‌లో అన్నీ గూగుల్ డౌన్‌లోడెడ్ ఫొటోలే
- మెయిన్‌హార్ట్ కంపెనీ పాకిస్థాన్‌లో చేపట్టిన రావీ ప్రాజెక్టు అట్టర్‌ఫ్లాప్
- ఆ కంపెనీకి రెడ్‌కార్నర్ నోటీసులు.. బ్లాక్ లిస్టులో పెట్టిన పలుదేశాలు
- పేదల్ని ముంచకుండా.. ఇండ్లు కూల్చకుండా పనులు చేపట్టొచ్చు
- నదీ ప్రక్షాళనకు బీఆర్ఎస్ హయాంలోనే 16 వేల కోట్లతో ప్లాన్
- మూసీపై బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ పవర్‌ఫుల్ ప్రజెంటేషన్

**శుభ తెలంగాణ హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్తున్న మూసీ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని, ఢిల్లీకి మూటలు పంపేందుకే ప్రాజెక్టుకు లక్షన్నర కోట్ల ఖర్చు అంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. రూ.25వేల కోట్లతో మూసీ ప్రాజెక్టును పూర్తి చేయవచ్చని, కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లక్షన్నర కోట్లతో ప్రాజెక్టు ఎందుకు చేపడుతున్నదో ప్రజలకు చెప్పాల్సిన అవసరముందని డిమాండ్ చేశారు. తాము మూసీ ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదన్న కేటీఆర్.. మూసీ పేరిట లూటీ చేస్తే, మూసీ పేరిట పేదల ఇండ్లను కూల్చివేసి వాళ్ల పొట్టగొడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మూసీని ఎందు కు ముందు వేసుకున్నదో చెప్పాలని నిలదీశారు. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రణాళికలు, పనుల వివరాలపై కేటీఆర్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రూ.16వేల కోట్లతో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బీఆర్ఎస్ రూపొందించిన మూసీ ప్రణాళికలను కాదని, ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ లక్షన్నర కోట్లకు ఎందుకు పెంచారో వివరించే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి లేదని దుయ్యబట్టారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే.. 'సీఎం రేవంత్‌రెడ్డి రెండు రోజుల కిందట ఇచ్చిన రెండు గంటల ప్రజెంటేషన్‌తో తన పరువు తానే తీసుకున్నాడు. చేయని సర్వేను చేసినట్టు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మూసీ పరీవాహక - మిగతా3లో



## రేవంత్‌పై మంత్రులు కుట్ర పన్నుతున్నారు

- బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- గోతికాడ నక్కలా రేవంత్‌ను దింపేయాలని కుట్ర చేస్తున్నారు
- హైడ్రా, మూసీ, గ్రూప్-1 విషయంలో జాగ్రత్త పడకపోతే.. రేవంత్ రెడ్డికు చిక్కులు తప్పవని
- గ్రూప్-1 అభ్యర్థుల మీద దాడులు చేయడం దారుణం

**శుభ తెలంగాణ కరీంనగర్**

కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీఎం పీఠం నుంచి దించాలని కాంగ్రెస్ మంత్రులు చూస్తున్నారని షాకింగ్ కామెంట్స్ చేశారు. గోతికాడ నక్కలా రేవంత్‌ను దింపేయాలని కుట్ర చేస్తున్నారని అన్నారు. హైడ్రా, మూసీ, గ్రూప్-1 విషయంలో జాగ్రత్త పడకపోతే.. రేవంత్ రెడ్డికు చిక్కులు - మిగతా3లో

# అనంతపురం జిల్లాలో ఎమ్మార్పీఎస్, వాల్మీకి సేవా సంఘం నాయకుల సమావేశం

## సామాజిక,రాజకీయ అంశాలపై సుదీర్ఘ చర్చలు..





**(శుభ తెలంగాణ/ఆంధ్రప్రదేశ్)** ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా తాడిపత్రి టౌన్ లో ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్స్ పోరాట సమితి)మరియు వాల్మీకి సేవా సంఘం నాయకుల సమాగమం జరిగింది.ఈ సమావేశం సామాజిక సమస్యలు,రాజకీయ అంశాలు మరియు భవిష్యత్తు కార్యాచరణపై దృష్టి సారించడం లక్ష్యంగా నిర్వహించబడింది. వివిధ జిల్లాల నుండి వచ్చిన నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని,వారి అనుభవాలను పంచుకున్నారు, ఫలితంగా ఈ సమావేశం తాడిపత్రి టౌన్‌లో చర్చకు కేంద్రంగా మారింది. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన అనేక ముఖ్య నాయకులు పాల్గొన్నారు.
టి.ఆదినారాయణ మాదిగ (జిల్లా ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్),చింతా పురుషోత్తం (పెద్దపప్పూరు మండల సిపిఐ కార్యదర్శి), పసలకంబగిరి మాదిగ(పెద్దప పూరు మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు),ఈశ్వరయ్య(వాల్మీకి సేవా సంఘం మండల నాయకులు)పుట్లూరు పుల్లయ్య (టిడిపి నాయకులు),తలారి నారాయణస్వామి,తలారి రామకృష్ణ (వాల్మీకి సేవా సంఘం నాయకులు) వంటి ప్రముఖులు ఈ సమావేశానికి హాజరై,తమ అభిప్రాయాలను తెలియజేశారు. వీరితోపాటు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రామాంజనేయులు మాదిగ,వాల్మీకి సంఘం ఓబులేసు, వాల్మీకి సేవా సంఘం సురేష్,దేవేంద్ర,చాగల్లు పులి చంద్ర,నందలపాడు పెద్దిరాజు,గార్లదిన్నె మల్లికార్జున వంటి నాయకులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.
సమావేశంలో ప్రధానంగా సమాజ అభివృద్ధి మరియు సామాజిక సాధికారత అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి.మాదిగ,వాల్మీకి వంటి సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి, వారికి సరైన అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. "సమాజ అభివృద్ధికి శ్రామికులు మరియు సామాజిక కార్యకర్తలు కృషి చేయాలి"అని టి.ఆదినారాయణ మాదిగ పేర్కొన్నారు.చింతా పురుషోత్తం మాట్లాడుతూ, "సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం సాధించడానికి ఒక్కొక్కరు ఒక్కో విధంగా కృషి చేయాలని,వలసబాట పట్టినవారి జీవితాల్లో మార్పు తీసుకురావడం ముఖ్యమని" తెలిపారు. ఈ సమావేశంలో భవిష్యత్తులో చేపట్టబోయే కార్యాచరణపై కూడా ప్రధానంగా చర్చ జరిగింది. ఎమ్మార్పీఎస్ మరియు వాల్మీకి సేవా సంఘం నాయకులు తమ అనుబంధ సంఘాలతో కలిసి పనిచేసి, సామాజిక సాధికారతకు మద్దతుగా ఉన్న ప్రభుత్వ విధానాలను సాధన చేయాలని నిర్ణయించారు. "కష్టాలు పడుతున్న మాదిగ, వాల్మీకి వర్గాలకు న్యాయం చేయడం మా లక్ష్యం"అని పసలకంబగిరి మాదిగ అన్నారు.తలారి నారాయణస్వామి మాట్లాడుతూ, "ప్రజల సమస్యలను ప్రతిపాదిస్తూ, వాటిని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లే విధంగా సమాజంలో మార్పు తీసుకురావడం చాలా అవసరం"అని తెలిపారు. సమాజ అభివృద్ధి కేవలం ఆర్థిక, రాజకీయ రంగాలకే పరిమితం కాకుండా,వైద్య మరియు విద్య రంగాల్లో కూడా సుదీర్ఘ ప్రణాళికలు రూపొందించాలని నేతలు అభిప్రాయపడ్డారు. రామాంజనేయులు మాదిగ మాట్లాడుతూ, "ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించడానికి, వారికి సరైన విద్యా అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని" సూచించారు. పుట్లూరు పుల్లయ్య మాట్లాడుతూ,"ప్రభుత్వాలు సామాజిక న్యాయం,విద్య, ఆరోగ్యం రంగాల్లో మరింత చొరవ చూపి,వర్గాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి"అని అన్నారు. ఇలాంటి సమావేశాలు వర్గాల అంతర్గత సంఘీభావం మరియు నాయకత్వాన్ని బలోపేతం చేయడంలో కీలకంగా ఉంటాయని నాయకులు పేర్కొన్నారు.తలారి రామకృష్ణ మాట్లాడుతూ,"సమాజానికి నాయకత్వం ఇచ్చే స్థాయిలో, ప్రతిభా సమృద్ధిగా ఉన్న వ్యక్తులు తమ వర్గాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యతను తీసుకోవాలని" సూచించారు. ఓబులేసు,సురేష్,దేవేంద్ర వంటి నాయకులు,తమ వర్గం సమస్యలపై విస్తృత ప్రచారం చేసి,ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో ముందుండాలని పేర్కొన్నారు.

# క్యాన్సర్,గుండెపోటు వ్యాధుల నియంత్రణ లక్ష్యంగా ఢిల్లీలో 18వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్

## భారతదేశంలో వ్యాధుల నియంత్రణకు ప్రతిష్టాత్మక సదస్సు

**(శుభ తెలంగాణ ప్రత్యేక )** న్యూఢిల్లీలో ఈనెల 18,19,20 తేదీల్లో 18వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్ భారీగా జరుగనుంది.ఈ సదస్సులో ప్రధానంగా భారత్‌లో క్యాన్సర్,గుండెపోటు వంటి ప్రాణాంతక వ్యాధులను తగ్గించడం,భవిష్యత్తులో ఈ వ్యాధులను నిరోధించడంపై దృష్టి పెట్టబడుతోంది.ఈ మహత్తర కార్యక్రమాన్ని లిఆపిలి(అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్)అధ్యక్షుడు డాక్టర్ సతీష్ కత్తుల ప్రకటించారు. ఈ గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ప్రపంచ వ్యాప్తంగా వైద్య రంగంలో ఉన్న ప్రముఖులు, పరిశోధకులు, పాలసీ మేకర్లు,వందలాది వైద్య విద్యార్థులు మరియు వివిధ వైద్య విభాగాల నిపుణులు హాజరవుతారు.ఈ సదస్సు ద్వారా క్యాన్సర్,గుండెపోటు వంటి వ్యాధులను కేవలం తగ్గించడం మాత్రమే కాకుండా,భవిష్యత్తులో సమర్థవంతంగా నిరోధించడానికి దేశంలోని ప్రభుత్వాలు,వైద్య నిపుణులు కలిసి తీసుకోవలసిన చర్యలపై సమాలోచనలు జరుగుతాయి.

### సదస్సుకు రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర ఆరోగ్య మంత్రి హాజరు..

ఈ ప్రతిష్టాత్మక సదస్సులో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము,ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ,కేంద్ర వైద్య ఆరోగ్య శాఖామాత్యులు శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా హాజరుకానున్నారు.అంతేకాకుండా,దేశ విదేశాల నుండి అనేక మంది వైద్య నిపుణులు,పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొంటారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించడానికి పునాది వేయాలన్నదే ప్రధాన ఉద్దేశ్యం.

### వైద్య రంగంలో కీలక పరిశోధనలు, అకడమిక్ సెషన్లు..

18వ గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌లో ప్రధానంగా అకడమిక్ సెషన్లు నిర్వహించబడతాయి.ఈ సెషన్లలో అనేక మంది వైద్య



నిపుణులు,పరిశోధకులు,పాలసీ మేకర్లు తమ అనుభవాలను పంచుకుంటారు.ముఖ్యంగా క్యాన్సర్,గుండెపోటు వంటి వ్యాధులపై వాతావరణ పరిస్థితులు,జన్యుపరమైన అంశాలు ఎలాంటి ప్రభావం చూపుతున్నాయన్న అంశాలపై ఆసక్తికరమైన పరిశోధనలు సమర్పించబడతాయి.ఈ సదస్సు ద్వారా దేశంలోని వైద్య రంగంలో తీసుకోవాల్సిన కీలక చర్యలపై నిర్ణయాలు తీసుకోవచ్చు.

### సరైన వ్యాయామం, సమతుల్య ఆహారం ముఖ్యమని నిపుణుల హితవు..

క్యాన్సర్,గుండెపోటు వంటి వ్యాధులను తగ్గించే క్రమంలో సరైన వ్యాయామం,సమతుల్య ఆహారం అనివార్యమని వైద్య నిపుణులు పేర్కొన్నారు.ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనశైలి అవలంబించడం ద్వారా అనారోగ్య సమస్యలు దూరం కావచ్చని, దీనికి ప్రభుత్వాలు కూడా సరైన విధానాలు రూపొందించాలని సూచించారు.దీనికి అనుగుణంగా ప్రభుత్వాలు ఆరోగ్యవంతమైన పాలసీలను అమలు చేయడం ద్వారా వ్యాధులను నియంత్రించే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

### వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వాల పాత్ర....

ఈ గ్లోబల్ హెల్త్ సమ్మిట్ ద్వారా అందరూ కలిసి పనిచేసి ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని అందించడమే ప్రధాన లక్ష్యం. క్యాన్సర్, గుండెపోటు వంటి వ్యాధులను నిరోధించడం కేవలం వైద్య రంగానికి మాత్రమే పరిమితం కాదు, దీనిలో ప్రభుత్వాల పాత్ర అత్యంత కీలకం. ప్రభుత్వాలు సరైన విధానాలను రూపొందించి, ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని వైద్య నిపుణులు పిలుపునిచ్చారు.

### సంస్థల భాగస్వామ్యం, కమ్యూనిటీ ఆరోగ్య చైతన్యం

సదస్సులో వేర్వేరు వైద్య రంగాలకు చెందిన అనేక సంస్థలు భాగస్వాములుగా పాల్గొంటున్నాయి.ఈ సదస్సు ద్వారా అనేక కమ్యూనిటీల స్థాయిలో సరైన ఆరోగ్యచైతన్యం తీసుకురావడం కూడా మరో ముఖ్య ఉద్దేశ్యంగా ఉంది.ప్రజలు ఆరోగ్యంపై సరైన అవగాహన కలిగి,దానిని రోజువారీ జీవితంలో అమలు చేసేందుకు సహాయపడే విధంగా అనేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని సతీష్ కత్తుల తెలిపారు.

### క్యాన్సర్,గుండెపోటు వ్యాధులపై నూతన విధానాలు..

ఈ సదస్సులో దేశంలోని వైద్యనిపుణులు క్యాన్సర్, గుండెపోటు వ్యాధుల నియంత్రణకు సంబంధించిన అనేక కొత్త విధానాలను ప్రతిపాదిస్తున్నారు.ఈ విధానాలు ప్రజలకు సాధ్యమైన మేరలో సులభంగా అందుబాటులో ఉండేలా రూపొందించాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచించారు. అలాగే వైద్య పరిశోధనలు మరియు క్లినికల్ ట్రయల్స్‌కు ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం అందించి,దేశంలో మెరుగైన వైద్య సేవలను అందించడంలో ముందుండాలని అభిప్రాయపడ్డారు.

# సిద్ధప్పకు బిగిస్తున్న ఉచ్చు

**బెంగళూరు :** ఈడి అధికారులు కర్ణాటకలోని మైసూరు డెవలప్మెంట్ అథారిటీ (ముడా) ఆఫీసలు శుక్రవారం తనిఖీలు చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఆయన కుటుంబ సభ్యులు ముడా భూముల్లో కేటాయింపుల్లో అవినీతికి పాల్పడ్డారని.. ఈ వ్యవహారంలో మనీ లాండరింగ్ జరిగిందని ఆరోపణలు రావడంతో 12 మంది ఈడీ అధికారుల బృందం.. మైసూరు లోని ముడా ఆఫీసుతో పాటు పలు చోట్ల తనిఖీలు చేశారు.ఈ తనిఖీల్లో ముడా కమిషనర్ రఘునందన్ తో పాటు స్పెషల్ ల్యాండ్ అక్విజిషన్ ఆఫీసుకు చెందిన పలువురు అధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆఫీసుల్లోని పలు కీలక ఫైల్స్‌ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ అధికారులందరికీ ముడా భూకుంభకోణంలో పాత్ర ఉందని అధికారులు అనుమానిస్తున్నట్లు జాతీయ మీడియా తెలిపింది.ఈడీ అధికారుల వెంట కేంద్ర పారామిలిటరీ బలగాలు కూడా తనిఖీల్లో పాల్గొనడం గమనార్హం. ఈడీ అధికారులు తనిఖీలు చేసిన ఆఫీసులన్నింటికీ ప్రత్యక్షంగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య లేదా ఆయన కుటుంబ సభ్యులతో లింక్ ఉన్నట్లు తెలుస్తోంది.ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అందరు ముడా అధికారులను ఈడీ అధికారులు.. విచారణ



జరపనున్నట్లు తెలుస్తోంది.ఇక ఈడీ అధికారుల తనిఖీల సందర్భంగా కేంద్ర పారామిలటరీ ఫోర్స్ వారి వెంబడి భద్రత కోసం రావడం గమనార్హం. మైసూరులోని వివిధ ప్రాంతాల్లో ఈడీ అధికారుల సోదాలు కొనసాగాయి. అయితే ఈ కేసులో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గానీ.. ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లలో గానీ, వారికి సంబంధించిన వారి ఇళ్లల్లో సోదాలు జరగలేదని అధికారులు పేర్కొన్నారు. అయితే ఇటీవలె అనారోగ్యం కారణంగా ముడా ఛైర్మన్ కే మరిగౌడ రాజీనామా చేయడం.. ఆ వెంటనే ఈడీ అధికారులు రంగంలోకి దిగడం సంచలనంగా మారింది.సిద్ధరామయ్య భార్య పార్వతి.. వివిధ ప్రాజెక్టుల కోసం మైసూరులోని ఇతర ప్రాంతాల్లో ఉన్న తన 3.16 ఎకరాల భూమిని ఇవ్వడంతో ముడా పరిధిలోని 14 ప్లాట్లను ఆమెకు కేటాయించారు. ఇందులో రూ.45 కోట్ల అవినీతి జరిగిందంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ కేసులో సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిదిపై ఆరోపణలు వచ్చాయి. ముడా కుంభకోణంలో సిద్ధరామయ్యతో పాటు మాజీ ఛైర్మన్ కే మరిగౌడ ప్రమేయం కూడా ఉన్నట్లు ఆరోపణలు రావడం తీవ్ర దుమారం రేపుతోంది. అయితే ఈ ముడా స్కామ్ ఆరోపణలు రావడంతో ఆ ప్లాట్లను సిద్ధరామయ్య భార్య తిరిగి ముడాకు అప్పగించింది. ఈ కేసులో తనను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని సీఎం సిద్ధరామయ్య కర్ణాటక హైకోర్టులో సవాల్ చేయగా. అక్కడ ఆయనకు ఎదురుదెబ్బ తగిలింది.ముడా భూ కుంబకోణంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పాత్ర ఉందని ఆరోపణలు రావడంతో ఆయనను విచారణ చేసేందుకు కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ అనుమతులిచ్చారు.

## చిక్కుల్లో మహారాష్ట్ర సీఎం కుమారుడు..

## మహాకాళి టెంపుల్ రూల్స్ బ్రేక్



అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడటంతో మహారాష్ట్ర రాజకీయాల్లో వేడి రాజుకుంది. అన్ని పార్టీల నేతలు వ్యూహ రచనల్లో బిజీబిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండేపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిషేధాజ్ఞలు ఉన్నప్పటికీ ఉజ్జయిని మహాకాళి ఆలయంలోని గర్భగుడిలోకి ఆయనను అనుమతించడంపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దాంతో అధికారులు విచారణకు ఆదేశించారు. శ్రీకాంత్ శిండే థానే జిల్లాలోని కల్యాణ్ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన గురువారం సాయంత్రం ఆ ఆలయానికి వెళ్లారు. భార్యతో కలిసి గర్భగుడిలోకి వెళ్లి పూజలు చేశారని ఆలయ వర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అయింది. సుమారు ఏడాది కాలంగా ఆ ఆలయ గర్భగుడిలోకి ప్రవేశంపై నిషేధం ఉన్నా షిండేను లోపలికి అనుమతించడం విమర్శలకు దారితీసింది. సామాన్యులు దైవ దర్శనం కోసం గంటల కొద్ది క్యూలో నిలబడి వేచిచూస్తుంటే.. వీఐపీలను మాత్రం నిషేధం ఉన్నా గర్భగుడిలోకి అనుమతిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఈ వ్యవహారం నిబంధనలకు విరుద్ధమని మండిపడింది. ఉజ్జయిని జిల్లా కలెక్టర్, ఆలయ కమిటీ ఛైర్మన్ నీరజ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. తాము ఎవరినీ గర్భగుడిలోకి అనుమతించలేదని చెప్పారు. అలాంటిదేమైనా జరిగి ఉంటే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించానని చెప్పారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## సత్యమేవ జయతే..

## జైలు నుంచి విడుదల కాగానే తొలి రియాక్షన్



**న్యూఢిల్లీ:** మనీ లాండరింగ్ కేసులో బెయిలు మంజూరు కావడంతో ఆప్ నేత, ఢిల్లీ మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ శుక్రవారం సాయంత్రం తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ముఖ్యమంత్రి అతిషి, ఆప్ కీలక నేతలు సంజయ్ సింగ్, మనీష్ సిసోడియా తదితరులు జైలు బయట సత్యేంద్ర జైన్‌కు సాదర స్వాగతం పలికారు. బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు తీసుకున్న నిర్ణయంపై సత్యేంద్ర జైన్ హర్షం వ్యక్తం చేశారు. ఇది సత్యానికి దక్కిన విజయమని అభివర్ణిస్తూ 'సత్యమేవ జయతే' అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు. మొహల్లా క్లినిక్, ఉచిత మందులు, పలు ఆరోగ్య పథకాలతో ఢిల్లీ మోడల్‌ను తీర్చిదిద్దడంలో సత్యేంద్ర జైన్ కృషి శ్లాఘనీయమని సంజయ్ సింగ్ అన్నారు. ఆప్ కార్యకర్తలు, నేతలకు ఇది పెద్దవార్త అని, 873 రోజులులో జైలులోనే ఉండి, 36 కిలోల బరువు తగ్గిపోయారని, ఆయినప్పటికీ ఆయనలో చెక్కుచెదరని స్ఫూర్తికి తాను సెల్యూట్ చేస్తున్నని చెప్పారు. సత్యేంద్ర జైన్, అరవింద్ కేజ్రీవాల్‌పై బీజేపీ తప్పుడు అభియోగాలు మోపి ఈడీతో జైలుకు పంపించిందని మనీష్ సిసోడియా ఆరోపించారు. దీంతో ఢిల్లీ ఆసుపత్రులు, మొహల్లా క్లినిక్‌లలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, తమ నేతలు ఒక్క రూపాయి పోగుచేసుకున్నట్టు కూడా నిరూపించలేక పోయారని, ఇప్పటికైనా ప్రధాని, బీజేపీ ఢిల్లీ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సత్యేంద్ర జైన్‌కు బెయిలుతో ఆప్‌కు మరింత బలం చేకూరిందని ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ అన్నారు. ఢిల్లీ ఎన్నికలకు ఆప్ సర్వసన్నద్ధంగా ఉందని ఆప్ మరో నేత సౌరభ భరద్వాజ్ ధీమా వ్యక్తం చేశారు.

## స్వాధీనం చేసుకున్న ఈవీఎంలను అప్పగించండి..

## హైకోర్టులో ఈసీ పిటిషన్



ముంబై: స్వాధీనం చేసుకున్న ఈవీఎంలను అప్పగించాలని ఎన్నికల సంఘం (ఈసీ) కోరింది. జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఉన్న 1,944 బ్యాలెట్ యూనిట్లు, 1,944 కంట్రోల్ యూనిట్లను విడుదల చేయాలని అభ్యర్థించింది. బాంబే హైకోర్టులో ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహారాష్ట్రలోని రత్నగిరి–సింధుదుర్గ్ నియోజక వర్గం ఫలితాలపై వివాదం తలెత్తింది. బీజేపీ అభ్యర్థి నారాయణ్ రాణే ఎన్నికను శివసేన (యూబీటీ) మాజీ ఎంపీ వినాయక్ రౌత్ కోర్టులో సవాల్ చేశారు. మోసపూరిత మార్గాల ద్వారా రాణే గెలిచారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆ నియోజకవర్గం ఎన్నికకు సంబంధించిన 1,944 బ్యాలెట్ యూనిట్లు, 1,944 కంట్రోల్ యూనిట్లను సీజ్ చేయాలని కోర్టు ఆదేశించింది. దీంతో గత ఆరేళ్లుగా జిల్లా ఎన్నికల అధికారి ఆధీనంలో అవి ఉన్నాయి. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీకి నవంబర్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి స్వాధీనంలో ఉన్న ఈవీఎంలు, కంట్రోల్ యూనిట్ల కోసం బాంబే హైకోర్టును ఈసీ ఆశ్రయించింది. అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగం కోసం 1,944 బ్యాలెట్ యూనిట్లు, 1,944 కంట్రోల్ యూనిట్లను రిలీజ్ చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను హైకోర్టు పరిశీలించనున్నది.

# ఏటీసీలో ప్రవేశాలకోసం దరఖాస్తులు చేసుకోవాలి

**సిద్దిపేట :** అర్హత కలిగి ఆసక్తి ఉన్న విద్యార్థులు అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ లో ఆధునాతన కోర్సులలో ప్రవేశలకోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి తెలిపారు. హైదరాబాద్ నుండి కార్మిక ఉపాధి కల్పన శిక్షణ మరియు ఫ్యాక్టరీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్ ఆ శాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్యతో కలిసి అడ్వాన్స్ ట్రైనింగ్ కేంద్రాల్లో అడ్మిషన్స్ ప్రక్రియ నిర్వహణపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఐటిఐ ప్రిన్సిపాల్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి ఐడిఓసి కార్యాలయం నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పనే ధ్యేయంగా అడ్వాన్స్ ట్రైనింగ్ కేంద్రాలు ద్వారా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పనకు ఏటీసీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఉపాధి ఉన్న కోర్సులను అధ్యయనం చేసి అడ్వాన్స్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 31వ తేది వరకు అడ్మిషన్లు కు గడువు పెంచినట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి ఫే?జ్ లో కుంకునూర్ పల్లి ఐటిఐ ని అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ గా మార్చి నూతనంగా మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్,ఆర్టిసన్ యుసింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిసైనర్ అండ్ వర్చ్యువల్ వెరిఫైర్ మెకానికల్, అడ్వాన్స్ సిఎన్సి మేషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్ వంటి ఆరు అధునాతన కోర్స్ లను ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. యువతకు వృత్తిపరమైన అవకాశాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో బహుళ సంస్థల్లో ఉపాధి కల్పనకు ప్రభుత్వం అధునాతన శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ శిక్షణ కేంద్రాలు వృత్తి



శిక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడ్డాయని 10వ తరగతి ఆపై విద్యార్హతలు ఉన్న విద్యార్థులకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు.

ఈ కేంద్రాల్లో నిర్వహించబడే శిక్షణ కార్యక్రమాలు విద్యార్థులకు ప్రాథమిక ఆవశ్యకతల నుంచి ప్రారంభించి ప్రొఫెషనల్ స్థాయికి చేరేవిధంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేయుటకు చివరి తేదీ ఈ నెల 31 వరకు పొడిగించినట్లు తెలిపారు. అర్హత కలిగి ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ లో ఆధునాతన కోర్సులలో ప్రవేశలకోసం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఏటిసి కేంద్రాల్లో అడ్మిషన్ల ప్రక్రియ పర్యవేక్షణకు డిఆర్డిఓను ప్రత్యేక నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు.

జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు 172 మంది విద్యార్థులను ఏటిసి కేంద్రాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని కుకునూర్ పల్లి ఏటిసి ప్రిన్సిపాల్ వెంకటరమణను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఉపాధికల్పనాధికారి రాఘవేందర్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ అధికారులపై అర్జెడికి ఫిర్యాదు

**వింత పోకడల అధికారులపై చర్యలు తీసుకోండి**

**యుఎస్పిసి నేతల డిమాండ్**

**జగిత్యాల :** స్కూల్ కాంప్లెక్స్ సబ్జెక్టు టీచర్ల సమావేశంలో, పి ఆర్ టి యు సమావేశల్లో అధ్యక్షునికి డి సి ఈ బి సెక్రటరీ సన్మానించడం, జిల్లా సైన్స్ అధికారి తీరు, ఇద్దరు ఎంఈవో ల తీరు అక్షేపనియకంగా ఉందని విరిపై చర్యలు తీసుకోవాలని యూ ఎస్ పిసి నాయకులు వరంగల్ అర్జెడి కి ఇచ్చిన వినతిపత్రం లో కోరారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో జిల్లాలో ఈ మధ్యనే పి ఆర్ టి యు జిల్లా సర్వ సభ్య సమావేశంలో జగిత్యాల రూరల్, గొల్లపల్లి మండల విద్యాధికారులు, జిల్లా డిసీ ఇబి సెక్రటరీ,జిల్లా సైన్స్ అధికారి బ్యాడ్జీలు, సంఘం కండువాలు ధరించి పాల్గొనడం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకమన్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్కూలు కాంప్లెక్సు సబ్జెక్టు ఉపాధ్యాయుల సమావేశంలో పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షునిగా ఇటీవల ఎన్నికైన వ్యక్తికి డి సి ఇ బి సెక్రటరీ మనోహర చారి ప్రభుత్వ శిక్షణ కార్యక్రమంలో సన్మానం చేయడం నిబంధనలకు విరుద్ధం అనిఅన్నారు. ఇలాంటి చర్యలు విద్యారంగంలో పెను పోకడలకు దారి తీస్తాయని, విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని యు ఎస్ పి సి పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా టి ఎస్ యు టి ఎఫ్ అద్యక్షులు తీరుకోవెల శ్యామ్ సుందర్, డిటీఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్నం రాంరెడ్డి, బిటీ ఎఫ్ జిల్లా అధ్యక్షులు దుమాల శంకర్ బాబు, టిపి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కుల రామచంద్రం, టి ఎస్ యు టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్ పాల్గొన్నారు.

## వైభవంగా త్రిశక్తి ఆలయంలో 'పౌర్ణమి పూజ'

**కోరుట్ల :** కోరుట్ల గణేష్ నవదుర్గా మండలి ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని త్రిశక్తి ఆలయంలో 'పౌర్ణమి పూజ'గరంగ వైభవంగా నిర్వహించారు. గణేష్ నవదుర్గా మండలి ఆద్వర్యంలో త్రిశక్తి మాత దేవాలయంలో నిర్వహించిన దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా సహకరించిన దాతలు, మిత్రులను సత్కరించారు. అనంతరం అమ్మవారి ఓడి బియ్యంతో అన్నప్రసాదం వితరణ జరిపారు. ఈ సందర్భంగా గణేష్ నవదుర్గా మండలి అద్యక్షులు కటుకం గణేష్ మాట్లాడుతూ ప్రతీ ఏటా దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలు ముగిసిన అనంతరం కోజాగిరి పౌర్ణమి సందర్భంగా 'పౌర్ణమి పూజ' నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాలకు సహకరించిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## అద్దెలు కట్టడం లేదు

**హైదరాబాద్ :** మూసి పునరుజ్జీవం పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం కాదు రేవంత్ రెడ్డి. .ముందు మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయండి, అలాగే అద్దెలు చెల్లించక తాళాలు వేస్తున్న గురుకుల స్కూల్స్,ప్రవేట్ బిల్డింగ్స్ లో నడుస్తున్న ప్రభుత్వ ఆఫీస్ ల అద్దెలు చెల్లించండని మాజీ మంత్రి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు. గురుకుల స్కూల్స్ కు అద్దె భవనాలకు కిరాయి కట్టక తాళాలు వేస్తున్నారు. రుణమాఫీ పైసలు లేవు,రైతు భరోసా కు పైసలు లేవు. మహిళలకు 2500 ఇవ్వడానికి పైసలు లేవు. పెన్షన్ 4 వేలు ఇవ్వడానికి పైసలు లేవు. రెడ్ హిల్స్ లో సబ్ రిజిస్టర్ ఆఫీస్ కు దానికి కిరాయి కట్టక ఆ బిల్డింగ్ ఓనర్ కరెంట్ కట్ చేసి తాళం వేశాడు అంటని అన్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు రెంట్ కట్టడానికి కూడా పైసలు లేవు కానీ లక్ష యాభై వేల కోట్లతో మూసి పునర్జీవం పేరు మీద డబ్బుల రియల్ ఎస్టేట్ దందా

# ఏ.టి.సి కోర్సులపై విస్తృత ప్రచారం కల్పించాలి

**పెద్దపల్లి, రామగుండం ఐటిఐ లలో ఏటిసి కేంద్రాల ఏర్పాటు**

**ఒక్కో ఏటిసి కేంద్రంలో 6 కోర్సులలో 172 సీట్లు**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి :** జిల్లాలో ఐటిఐ కేంద్రాల లో ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సుల ప్రవేశాలపై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశాల పై పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ×జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఐటిఐ కళాశాలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లను ప్రారంభిం చిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా హైదరాబా దులో ఒకేసారి 65 ఏటిసి కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని అన్నారు. మొదటి దశలో 25 ఏటీసీ కేంద్రాలలో ప్రభుత్వం అడ్మిషన్స్ ప్రారంభిస్తుందని, దీనికి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు వచ్చాయని అన్నారు. మన జిల్లాలో ఉన్న ఐటిఐ రామగుండం, ఐటిఐ పెద్దపల్లిలో 2 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ మంజూరు కావడం జరిగిందని అన్నారు. మన జిల్లాలో ఉన్న 2 ఏ.టి.సి కేంద్రాలు మొదటి దశలో ఎంపిక కావడం జరిగిందని , ఒక్కో చోట 6 కోర్సులలో 172 సీట్లు అడ్మిషన్స్ ప్రారంభించ దం జరిగిందని అన్నారు.

జిల్లాలోని ఏ.టి.సి లలో అడ్మిషన్స్ కు ఈ నెల 30 వరకు ఉందని తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఏ.టి.సీ కోర్సులు పొందేందుకు అర్హులని అన్నారు. ఈ కోర్సులతో మల్టి నేషనల్ కంపెనీలలో తప్పనిసరిగా ఉద్యోగం లభిస్తుందని అన్నారు. మన జిల్లాలో ఒక సంవత్సరం కాలపరిమితి గల మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ ఛ డిజిటల్ మ్యాను ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టీసీ యూజింగ్ అడ్వాన్స్ టూల్ కోర్సులలో 40 సీట్లు ఉన్నాయని, రెండు సంవత్సరాల కాల పరిమితి గల బేసిక్ డిజైనర్ అండ్ పర్చుయల్ వెరిఫైర్ (మెకానికల్), అడ్వాన్సుడ్ సి.ఎన్.సి మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులలో 24 సీట్లు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్ డిమాండ్ ప్రకారం టాటా




కన్సల్టిస్ వారితో సమన్వయం చేసుకొని ఈ కోర్సులను డిజైన్ చేశామని అన్నారు. ఐటీఐ పెద్దపల్లి లోని ఏటిసి కేంద్రంలో 172 సీట్లకు 110 పైగా సీట్లు ఇప్పటి వరకు భర్తీ జరిగాయని, రామగుండం ఏటీసీ కేంద్రంలో 35 సీట్లు మాత్రమే నిండాయని, జిల్లాలో ఉన్న యువత యువకులు ఈ అవకాశాన్ని వినియోగించు కొని కోర్సులలో జాయిన్ కావాలని కలెక్టర్ కోరారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సులలో జాయిన్ అయ్యేందుకు అడ్మిషన్ కోసం తిబితి.బివశ్రీజీనిణజీనిజీ.ణనీల.తిని ఆన్ లైన్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్లతో (పదవ తరగతి మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, టిసి, ఆధార్ కార్డ్) పెద్దపల్లి ఐటిఐ కేంద్రంలో సంప్రదించాలని కోరారు. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ కోరారు. అభ్యర్థులు ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రంలో ప్రవేశాలకు కనీస వయసు 14 సంవత్సరా లు మాత్రమేనని అన్నారు. ఏ.టి.సి కేంద్రం భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, కోర్సులకు సంబంధించి అవసరమైన పరికరాల సైతం జిల్లాకు చేరుకున్నాయని అన్నారు. సెలవు దినాలలో కూడా అడ్మిషన్స్ స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి తిరుపతి, పెద్దపల్లి, రామగుండం ఐటిఐ ప్రిన్సిపాల్స్ , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# మూసీ నది పునరావాస మహిళా సంఘాలకు రుణాలు

**17 మహిళా సంఘాలకు చెక్కులు అందజేసిన మంత్రి సీతక్క**




**హైదరాబాద్ :** మూసీ నది పునరావాస మహిళా సంఘాలకు ప్రభుత్వం రుణాలు ఇచ్చింది. పునరావాసం పొందిన 17 స్వయం సహాయక మహిళా సంఘాలకు మంత్రి సీతక్క చెక్కులు అందజేసింది. ఈ కార్యక్రమంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు బలాలా, కౌసర్ మోయినుద్దీన్, హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, సేర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, స్త్రీ నిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. 17 గ్రూపుల నుంచి 3 కోట్ల 44 లక్షల చెక్కులను 172 మంది మహిళలు అందుకున్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఒక ప్రాంతం నుంచి మరొక చోటుకు వెళ్ళినప్పుడు కొంత కష్టంగా వుంటుందని అన్నారు. కానీ వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మూసీ నది వరద ఉదృతి పెరిగితే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రకృతి వైపరిత్యాలు దేశంలో సంభవిస్తున్నాయి. మంచి వాతావరణంలో మనం జీవించాలి. మంచి గాలి , నీళ్లు దొరికే ప్రదేశంలో జీవనం సాగించాలి. ఒక తరం మూసీ నదీ పరీవాహక ప్రాంతంలో ఇబ్బందుల్లో నివసించారు. రేపటి తరమైన మంచి వాతావరణంలో బతికేలా చూడాల్సిన బాధ్యత మన మీద ఉంది. మహిళా గ్రూపులలో ఒక్కో మహిళలకు 2 లక్షలు రూపాయలు రుణాలు ఇస్తున్నాం. 2 లక్షల రుణాలలో లక్షా 40 వేలను ప్రభుత్వం మాఫీ చేస్తుంది. కేవలం 60 వేలను మహిళా సంఘాలు కట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వం సహాయంతో మంచి వ్యాపారాలు చేసుకోవాలి. కుట్టు మిషన్లను సైతం మూసీ నది మహిళా సంఘాలకు ఇస్తాం. వివిధ రకాల వ్యాపారాలకి మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తాం. మూసీ నది పునరావాస పొందిన వారి పిల్లలకు అన్ని రకాల విద్యా సదుపాయాలను కల్పిస్తున్నామని అన్నారు.

## చట్నీస్‌లో అంతే పాచిన పిండి, కుళ్లిన ఉల్లి

**హైదరాబాద్ :** పేరుకు స్టార్ హోటల్స్.. వాటిని ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేస్తే కానీ, వాటి అసలు రంగు బయటపడడం లేదు. అన్నీ హోటల్స్ ఒకేలా ఉండవని అనుకున్నా, ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలలో బయటపడే అక్కడి స్థితిగతులు గమనిస్తే.. ఎంచక్కా ఇంట్లో పచ్చడి మెతుకులు తిన్నా మేలే అనిపించక మానదు మనకు.ప్రస్తుత కాలంలో ఎవరి లైఫ్ చూసినా బిజీబిజీ. టైం కి ఆహారం కూడా తయారు చేసుకోలేని బిజీ లైఫ్ కొందరిది. అందుకే హోటల్స్ బాట పడుతున్నారు కొందరు. ఇదే ఆసరాగా తీసుకున్న కొన్ని హోటల్స్ నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చేస్తున్నాయి. ఇటువంటి వాటిని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విస్తృత తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ తనిఖీలతో కొందరు హోటల్స్, రెస్టారెంట్ యజమానులు బెంబేలెత్తి పోతున్నారు. మరికొందరు మాత్రం ఈ తనిఖీల వల్ల అంతా మేలు జరుగుతుందని తెలుపుతున్నారు.ఇటువంటి పరిస్థితుల్లో హైదరాబాద్ లోని కొండాపూర్ లో గల శరత్ సిటీ మాల్ లో గల చట్నీ టిఫిన్ సెంటర్ ను శుక్రవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేసినట్లు తమ ఎక్స్ ఖాతా ద్వారా ప్రకటించారు. అయితే ఈ తనిఖీలో అక్కడ ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ లైసెన్స్ కనిపించేవిధంగా ప్రదర్శించబడలేదన్నారు. అలాగే ముడిసరుకు నిల్వ చేసే ప్రదేశంలో అధికారులకు బొద్దింకలు కనిపించగా అవాక్కయ్యారట. అంతేకాదు రవ్వ, పిండి పదార్థాలకు నల్ల పురుగులు ఉండగా అధికారులు అసహనం వ్యక్తం చేశారు. ఇక ఉల్లిపాయలు, క్యాబేజీ చూసిన అధికారులు మరింత ఆగ్రహం వ్యక్తం చేసి, ఇటువంటి చర్యలు మరలా పునరావృతమైతే చర్యలు తప్పక తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడ చూసినా దుర్గంధం రావడంతో అధికారులు జరిమానా విధించినట్లు సమాచారం.అలాగే అల్పార్ టిఫిన్ సెంటర్ లో కూడా తనిఖీలు నిర్వహించిన అధికారులు.. అక్కడ కూడా నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్లు గుర్తించి వారిని కూడా హెచ్చరించారు. ఇలా అధికారుల తనిఖీలు సాగుతున్నంత సేపు.. చుట్టు ప్రక్కల హోటల్స్ యజమానులు హోటళ్లను మూసివేయడం విశేషం. స్థానిక ప్రజలు మాత్రం తనిఖీలకు అదేశాలిచ్చిన ప్రభుత్వానికి, ఫుడ్ సేఫ్టీ అధికారులకు అభినందనలు తెలిపారు.ప్రతిరోజూ అధికారుల తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు పాటించని హోటల్స్, రెస్టారెంట్ లకు జరిమానాలతో సరిపెట్టకుండా.. సీజ్ చేయాలన్న అభిప్రాయాన్ని స్థానిక ప్రజలు వ్యక్తం చేశారు. ఏదిఏమైనా ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్న హోటల్స్ పై నిఘా ఉంచి, మరలా ఇటువంటివి పునరావృతం కాకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే నిబంధనలు పాటిస్తున్న హోటల్స్, రెస్టారెంట్స్ లకు అవార్డులు కూడా ప్రకటిస్తే బాగుంటుందన్నది భోజన ప్రియుల అభిప్రాయం.

## యాసిడ్‌తో పాల తయారీ

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో కల్తీ మాఫియా రెచ్చిపోతుంది. అక్రమ సంపాదనే ధ్యేయంగా వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో కల్తీపాలను తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టు అయ్యింది. మేడిపల్లిలో నకిలీ పాలు తయారు చేస్తున్నారన్న పక్కా సమాచారంతో.. పాల తయారీ కేంద్రంపై మల్కాజ్‌గిరి ఎస్‌వోటీ పోలీసులు దాడులు జరిపారు. పౌడర్‌తో నకిలీ పాలు తయారు చేస్తున్న గజేందర్ సింగ్ రాజ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల చేసిన తనిఖీల్లో..300 కేజీల పన్నీరు, 4 వేల 500 లీటర్ల రిఫైండ్ ఆయిల్, 750 లీటర్ల అసిటిక్ యాసిడ్, 15 లీటర్ల గ్లూకోజ్ లిక్విడ్‌ను సీజ్ చేసారు. దాంతో పాటు 16 వేల 250 కేజీల స్కీమ్డ్ మిల్క్ పౌడర్‌ను ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గజేందర్ పై కేసు నమోదు చేసి పీఎస్‌కు తరలించారు. పీర్జాదిగూడా ప్రాంతంలోనే కాకుండా బోడుప్పల్, ఉప్పల్ ప్రాంతాల్లోనూ పాలు సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు.ఇదిలా ఉంటే మరోవైపు.. జనాల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి చికెన్ సెంటర్లు. కుళ్లి పోయిన చికెన్ యధేచ్ఛగా అమ్మేస్తున్నాయి. సికింద్రాబాద్ బేగంపేట్ ప్రకాష్ నగర్‌లో నార్త్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసుల సోదాల్లో భయంకరమైన విషయాలు బయటకొచ్చాయి. బాలయ్య చికెన్ సెంటర్‌లో కుళ్లిన కోడి మాంసం బయటపడింది. కోడి ఎముకలకు కెమికల్స్ కలిపి ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు.. జనతా బార్లకు అమ్మేస్తున్నారు .టాస్క్ ఫోర్స్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారుల కలిసి ఆకస్మిక తనిఖీలు చేశాయి. బాలయ్య చికెన్ సెంటర్ లో తనిఖీలు నిర్వహించగా కుళ్ళిన కోడి మాంసంంతోపాటు కొవ్వు పదార్థాలు దొరికాయి. ఏడు క్వింటాళ్ల కుళ్ళిన చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బాలయ్య చికెన్ సెంటర్‌కు తాళాలు వేశారు.

## అమెరికాలో బాలికపై లైంగిక వేధింపులు

**హైదరాబాద్ :** పెద్దమనిషిగా చెలామణి అయ్యాడు. తెలుగు వారికి అండగా నిలిచానన్నాడు. అంతా తానై ఉంటానంటూ భరోసా ఇచ్చాడు. ఇదంతా నిజమేనని నమ్మారు తెలుగువారు. ఇన్నాళ్ల తర్వాత అసలు రంగు తెలిసి అవాక్కయ్యారు. ఛీ. ఇంతటి నీచుడా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అమెరికా వర్జీనియాలో తెలుగు వ్యక్తి ఫణి తాళ్లూరిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ బాలికపై పలుమార్లు లైంగికదాడికి తెగబడినట్లు వచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. లైంగికదాడితోపాటు నగ్నఫొటోలతో బెదిరించినట్లు బాధితురాలు ఆరోపించింది. వేధింపులు భరించలేక తల్లిదండ్రులతో కలిసి పోలీసులను ఆశ్రయించడంతో విషయం బయటకు వచ్చింది. 2022 నుంచి దర్యాప్తు చేపట్టిన అమెరికా పోలీసులు తాజాగా ఆయనను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఫణి తాళ్లూరి అడల్ట్ డిటెన్షన్ సెంటర్‌లో ఉన్నాడు.అమెరికా చట్టాల మైనర్లపై లైంగిక వేధింపులకు పాల్పడితే రాజీలతో ప్రమేయం లేకుండా సదరు నిందితులపై చట్ట ప్రకారం కోర్టుల ద్వారా విచారణ చేపట్టి శిక్ష విధిస్తారు. ఫణి తాళ్లూరిపై వస్తున్న ఆరోపణలు అన్ని రుజువైతే ఆయనకు 60ఏళ్లు శిక్ష పడే అవకాశముంది. అమెరికాలో లైంగికదాడి కేసులో తెలుగువాడి అరెస్టు కలవరం పుట్టించింది. తెలుగు కమ్యూనిటీలో ఇప్పుడు ఇదే హాట్‌టాపిక్‌గా మారింది. ఫణి బాధితులు చాలామందే ఉన్నారనే చర్చ కొనసాగుతోంది. పదుల సంఖ్యలో మైనర్లపై ఫణి అఘాయిత్యానికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నా.. బయటకు వచ్చింది ఒక్కరే అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.ఫణి తాళ్లూరు అసలు రంగు ఇప్పటికైనా బయట పడిందంటున్నారు ఔఖీఎలు. విరాళాల పేరుతో, సమాజ సేవ చేస్తున్నట్టు బిల్డప్ ఇస్తూ పెద్దమనిషిగా చలామణి అయ్యారని ఆరోపించారు. లైంగికదాడులతో ఫణి అసలు రంగు తెలియడంతో షాక్‌కు గురయ్యారు. తెలుగువారు ఎక్కువగా ఉండే 'వర్జీనియా యాష్‌బర్న్' ప్రాంతంలో ఫణి తాళ్లూరి బాధితులు ఇంకా ఎందరున్నారు..? వాళ్లు కూడా నోరు విప్పుతారా..? అన్నది చర్చనీయాంశంగా మారింది

## పోలీస్ స్టేషన్‌లోనే ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం

**వరంగల్ :** జనగామ జిల్లా పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో సిబ్బంది అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడే సంఘటన జరిగింది. భార్యాభర్తల పంచాయతీలో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఓ వ్యక్తి అక్కడే ఒంటిపై పెట్రోల్ పోసుకొని పట్టించుకున్నాడు. అతన్ని అడ్డుకుబోయిన పోలీసులకు ఆ నిప్పునీటుకుని తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో స్పందించిన తోటి సిబ్బంది హుటాహుటీన క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.పాలకుర్తి మండలం కొండాపురం గ్రామ శివారు మేకలతండాకు చెందిన లాకవత్ శీను ? అతని భార్య రాధిక మధ్య కొంతకాలంగా కుటుంబ కలహాలు చెలరేగుతున్నాయి. భర్త వేధింపులు భరించలేక మనోవేధన గురైన రాధిక పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో శ్రీనును పోలీసులు పాలకుర్తి పోలీస్ స్టేషన్ పిలిపించారు. భార్యాభర్తలిద్దరికీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రములో ఒక్కసారిగా ఊగిపోయిన శ్రీనివాస్ తన వాహనంలోని పెట్రోలు తీసి తన ఒంటిపై కోసుకున్నాడు. అంతటితో ఆగకుండా వెంటనే నిప్పంటించుకున్నాడు.అయితే ఇదంతా పోలీసుల ముందే జరగడంతో వెంటనే అప్రమత్తమయ్యారు. కాపాడబోయిన ఎస్సై సాయి ప్రసన్నకుమార్, కానిస్టేబుల్ రవీందర్‌కు ఆ మంటలు అంటుకున్నాయి. ఎస్సై సాయి ప్రసన్నకుమార్ చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కానిస్టేబుల్ రవీందర్ చేతులు, కాళ్ళకు నిప్పు అంటుకుంది. గాయాలపాలైన శ్రీనుతోపాటు ఇద్దరు పోలీస్ సిబ్బందిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. పాలకుర్తి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం శీను జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# చిన్నపిల్లలకు ఆయిల్ మసాజ్ చేస్తున్నారా!



పిల్లల సంరక్షణ చాలా బాధ్యతతో కూడుకుని ఉంటుంది. ముఖ్యంగా చిన్న పిల్లలు, అప్పుడే పుట్టిన పిల్లలు చాలా సున్నితంగా ఉంటారు. వారికి ఒక వయసు వచ్చేవరకు వారిని చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా పిల్లలకు స్నానం చేయించడం అమ్మమ్మలు, బామ్మల పర్యవేక్షణలో లేదా వారి చేతుల మీద జరుగుతూ ఉంటుంది. చాలా కాలం నుంచే చిన్న పిల్లలకు ఒళ్లంతా నూనెతో మసాజ్ చేసి ఆ తరువాత స్నానం చేయించడం జరుగుతోంది. ఇదే పద్ధతి మళ్లీ ఈ మధ్య కాలంలో బేబీ మసాజ్ పేరిట కొత్త పుంతలు తొక్కుతోంది. పిల్లలకు మసాజ్ చేయడం కోసం కొబ్బరినూనె, ఆలివ్ నూనె, బాదం నూనె లేదా ఆవాల నూనె వంటివి ఉపయోగిస్తుంటారు. అసలు పిల్లలకు మసాజ్ చేయడం ఎంత వరకు మంచిది? పిల్లలకు మసాజ్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలేంటి? తెలుసుకుంటే.. మసాజ్ అనేది శరీరంలో కండరాలను ఒత్తిడికి గురి చేసే ప్రక్రియ. ఇది శరీరంలో కండరాలను రిలాక్స్ చేస్తుంది. ఎముకలు, కీళ్లు మొదలైన వాటి ఆరోగ్యం మెరుగ్గా ఉండేలా చేస్తుంది. శరీర కణజాల అభివృద్ధికి దోహదపడుతుంది. మసాజ్ వల్ల కలిగే ప్రయోజనాలేంటంటే.. చిన్న పిల్లలకు మసాజ్ ఎన్నో ఏళ్ల కిందటి నుండి పెద్దలు చేస్తున్న ప్రక్రియనే అయినా.. నేటి కాలంలో వైద్య పరంగాను, పిల్లల సంరక్షణలో భాగంగానూ దీనికి ప్రాధాన్యత పెరిగింది. ముఖ్యంగా 2021లో జరిగిన పరిశోధనలలో పిల్లలకు మసాజ్ చేయడం వల్ల కింది ప్రయోజనాలు కలుగుతాయని స్పష్టం చేశారు.. పిల్లలకు మసాజ్ చేయడం వల్ల కండరాలు, ఎముకలు బలపడతాయి. దీని వల్ల పిల్లలు బలంగా ఉంటారు. మసాజ్ చేస్తే చేతులు, కాళ్లలో పట్టు పెరుగుతుంది. కాళ్లు చేతులు దృఢంగా మారతాయి. కాళ్లు చేతులలోనే కాకుండా శరీరం అంతా రక్తప్రసరణ మెరుగ్గా ఉంటుంది. మసాజ్ చేసిన తరువాత పిల్లలకు స్నానం చేయిస్తే హాయిగా నిద్ర పోతారు. ఇది పిల్లలలో నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. పిల్లలలో అలసట, ఒత్తిడి వంటివి తగ్గుతాయి. పిల్లలకు మసాజ్ చేయడం వల్ల శరీరంలో రక్త ప్రవాహం, ఆక్సిజన్ ప్రవాహం మెరుగవుతుంది. శ్వాస ఆరోగ్యం బలపడుతుంది. ఊపిరితిత్తుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. గ్యాస్, ఉబ్బరం, కండరాల తిమ్మిరి, మలబద్దకం వంటి సమస్యలు పిల్లలలోనూ ఉంటాయి. పిల్లలకు మసాజ్ చేయడం వల్ల ఇవన్నీ తగ్గుముఖం పడతాయి.

## పుట్టబోయే బిడ్డ అవయవాలు

# ప్లాస్టిక్‌తో నిండిపోతే.!

ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణానికి ముప్పుగా పరిణమించింది. గ్రహం, మనుషుల ఆరోగ్యంపై ప్రభావం ఆందోళనలను రేకెత్తిస్తుంది. ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిన మహాసముద్రాలు, ఆహారంలోకి చొరబడిన మైక్రో ప్లాస్టిక్స్, శ్వాస తీసుకుంటే బ్రెయిన్ లోకి వెళ్తున్న ప్లాస్టిక్ కణాలు.. రక్తం, గుండె చివరకు జననేంద్రియా ల్లోనూ కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో శాస్త్రవేత్తలు, ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం నుంచి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.కాగా తాజా అధ్యయనం మరో బాంబు పేల్చింది. గర్భంలో ఉన్న బిడ్డకు తల్లి నుంచి ప్లాస్టిక్స్ చేరే అవకాశం ఉందని తెలిపింది. పాలిమైడ్ 12 అని పిలువబడే చిన్న ప్లాస్టిక్ కణాలు.. నవజాత శిశువుల గుండె, మెదడు, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్రపిండాల్లోకి చేరుతాయని తెలిపింది. ఈ పరిశోధన గర్భధారణ సమయంలో పిండం అభివృద్ధిపై భయాన్ని..



తీసుకోవాల్సిన జాగ్రత్తలను హైలెట్ చేస్తుంది. సైన్స్ ఆఫ్ ది టోటల్ ఎన్విరాన్మెంట్ జర్నల్ లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం.. ఈ ప్లాస్టిక్ కణాలు ప్లాసెంటల్ అవరోధాన్ని దాటుకుని, అభివృద్ధి చెందుతున్న పిండాన్ని హానికరమైన కాలుష్య కారకాలకు గురిచేస్తాయి. రట్జర్స్ హెల్త్ పరిశోధకులు చేసిన ప్రయోగంలో ఎలుకలను వారం రోజులపాటు ప్లాస్టిక్ కణాలకు బహిర్గతం చేశారు. తల్లి, పిండం మధ్య రక్త ప్రసరణలో కూడా వీటిని గుర్తించారు. బిడ్డ పుట్టిన రెండు వారాల తర్వాత పరిశీలించగా.. తల్లి మెదడు, మూత్రపిండాలు, గుండె, కాలేయంలో ఉన్న అవే ప్లాస్టిక్స్ నవజాత శిశువుల అవయవాల్లో గుర్తించారు. ఇవి బేబీ ఎదుగుదలపై భారీ ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. కాగా ప్లాస్టిక్ పొల్యూషన్ దీర్ఘకాలిక ఆరోగ్య ప్రభావంపై తీవ్ర ఆందోళనలను పెంచుతుంది.

## రోజూ గుప్పెడు బాదం తింటే..



నిత్యం బాదం తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిదని వైద్యులు చెబుతున్నారు. బాదంను సూపర్‌ఫుడ్ అని పిలుస్తారు. దీనిలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పోషకాలు పుష్కలంగా ఉన్నాయి.విటమిన్ ఇ, ఫైబర్, ప్రొటీన్, ఖనిజాలు చాలా ఉంటాయి. ఇందులో ఉండే మోనోశాకరైడ్లు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో ఉపయోగపడతాయి. గుప్పెడు బాదాన్ని మీ డైట్‌లో చేర్చుకుంటే. చురుగ్గా మెదడు.. నిత్యం కొన్ని బాదం పప్పులను మీ డైట్‌లో చేర్చుకుంటే మెదడు చురుగ్గా మారుతుంది. మెదడు పనితీరు మెరుగుపడుతుంది. ఆలోచన సామర్థ్యం, మానసిక స్థైర్యం పెరుగుతుంది. గుండెకు బలం.. బాదం ఈ కాలంలో ప్రతి రోజూ తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు అందుతాయి. ఇందులోని సంతృప్త కొవ్వులు తక్కువగా ఉండి, మోనోశాచురేటెడ్ కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, యాంటీ ఆక్సిడెంట్ గా పనిచేస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో సహకరిస్తుంది.మెదడు పనితీరు.. బాదంలోని విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడంట్లు, ఒమేగా 3, ఫ్లాటీ యాసిడ్స్ తో సహా అన్ని పోశకాలు మెదడు పనితీరులో కీలకంగా పనిచేస్తాయి. తెలివి తేటలను పెంచడంలోనూ బాదం మెరుగ్గా పనిచేస్తుంది. రోగ నిరోధక శక్తి.. బాదంలో ఉండే విటమిన్లు, పోషకాలు జలుబుస ఫ్లూ వంటి లక్షణాలను దూరం చేయడంలో సహకరిస్తుంది. చాలా రకాల వ్యాధులతో పోరాడేందుకు శీతాకాలంలో రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేసేందుకు సహకరిస్తుంది. బరువు తగ్గడంలోనూ.. క్యాలరీలు ఎక్కువగా ఉన్న బాదాన్ని తీసుకోవడం వల్ల బరువును తగ్గించడంలో సహకరిస్తుంది. బాదంలో ఫైబర్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు సంతృప్తిగా ఉన్నాయి. ఇవి అతిగా తినే అలవాటును తగ్గించడంలో, బ్యాలెన్స్ డైట్ తీసుకునే విధంగా ప్రోత్సహిస్తాయి. ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియ.. బాదం ఫైబర్ అధికంగా ఉండే ఆహారం. ఇది జీర్ణ క్రియకు సహకరిస్తుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది. ఫైబర్ కంటెంట్ ఆరోగ్యకరమైన ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. చర్మం నిగారింపు.. బాదంపప్పులో విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు, చర్మాన్ని నిగారింపుతో, కాంతి వంతంగా ఉంచేందుకు సహకరిస్తాయి. మెరిసే చర్మం కావాలంటే రోజూ నాలుగు నుంచి ఆరు బాదం పప్పులను నీటిలో రాత్రి నానబెట్టి ఉదయాన్నే తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

## ఏ వయసులో దంతాలు బలహీనమవుతాయి..?



దంతాలు మానవ జీవితంలో అంతర్భాగం. నోటి ఆరోగ్యం మన మొత్తం ఆరోగ్యానికి సంబంధించినది. ఇది ఆరోగ్యానికి చాలా ముఖ్యమైన అంశం అయినప్పటికీ, చాలా మంది దంత పరిశుభ్రతపై పెద్దగా శ్రద్ధ చూపరు. రోజుకు రెండుసార్లు పళ్ళు తోముకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. కానీ, చాలా తక్కువ మంది మాత్రమే దీనిని అనుసరిస్తున్నారు. మీకు పంటి నొప్పి వచ్చినప్పుడు లేదా పరిస్థితి మీ అదుపులో లేనప్పుడు దంతవైద్యుని వద్దకు వెళ్లే బదులు, వారిని క్రమం తప్పకుండా సందర్శించడం , మంచి పరిశుభ్రత గురించి తెలుసుకోవడం మీ దంతాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మీకు సహాయపడుతుంది. ముఖ్యంగా ఇటీవలి కాలంలో చాలా మందిలో దంత సమస్యలు పెరుగుతున్నాయి. కాబట్టి, పంటి నొప్పి, పుచ్చిపోవడం లేదా మరేదైనా సమస్య ఉన్నప్పుడు ఒక వ్యక్తి చిరాకు పడతాడు. ముఖ్యంగా కొన్ని వయసులలో దంతాలు చాలా సున్నితంగా ఉంటాయి. ప్రధానంగా 20 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్కులు దంత సమస్యలకు గురవుతారు. ఈ సమస్యలో పంటి నొప్పి, యాసిడ్ రియాక్షన్లు, క్షయం , ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి దీని వెనుక గల కారణాలు , దీనికి పరిష్కారం ఏమిటో తెలుసుకుందాం. సున్నితమైన దంతాల కారణాలు: సున్నితమైన దంతాలకు అత్యంత సాధారణ కారణం బలహీనమైన చిగుళ్ళు. బలహీనమైన చిగుళ్ళు దంత సమస్యలకు దారితీస్తాయి. దంతాలలో ఆమ్ల పదార్థాలు చేరడం: దంతాల ఎనామిల్, బలమైన బ్రషింగ్, ఆమ్ల ఆహారాలు , పానీయాలు దంతాలను దెబ్బతీస్తాయి. ఈ కారకాలన్నీ దంతాల నిర్మాణం సమస్యలను కలిగిస్తాయి. మీరు హార్డ్ బ్రష్ ఉపయోగిస్తుంటే ఈ సమస్య పెరుగుతుంది. కాబట్టి ఎల్లప్పుడూ మృదువైన బ్రష్‌ని ఉపయోగించండి. గట్టి బ్రష్ మీ దంతాలను అనేక విధాలుగా దెబ్బతీస్తుంది.

## అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను ఫ్రిడ్జ్‌లో పెట్టడం మంచిదేనా!



అల్లం వెల్లుల్లి పేస్ట్.. ఈ మధ్య కాలంలో వంటల్లో చాలా సాధారణం అయిపోయింది. మొదట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ ను మసాలా వంటల్లోనే ఉపయోగించేవారు. కానీ ఇప్పుడు అల్లం వెల్లుల్లి పేస్ట్ సాధారణ కూరల్లో కూడా ఉపయోగిస్తున్నారు. ఈ కారణంగా చాలామంది అల్లం వెల్లుల్లి పేస్ట్ ను పెద్ద మొత్తంలో తయారు చేసుకుని లేదా కొని ఫ్రిడ్జ్ లో నిల్వ చేస్తుంటారు. అయితే దీన్ని ఫ్రిడ్జ్ లో నిల్వ చేయడం మంచిదేనా? దీన్ని నిల్వ చేయడానికి సరైన పద్ధతి ఏంటి? అల్లాన్ని, వెల్లుల్లిని ఫ్రిజ్ లో పెడితే జరిగేదేంటి? టీ నుండి కూరలు వండటం వరకు అల్లం వాడతారు. చలికాలంలో అల్లం ఎక్కువగా తీసుకుంటారు. అయితే అల్లం చాలా రకాల ఆరోగ్య సమస్యలకు దివ్య ఔషధంలా పనిచేస్తుంది. అయితే అల్లాన్ని మార్కెట్ నుండి తీసుకురాగానే నేరుగా ఏదో ఒక కవర్ లో వేసి ఫ్రిడ్జ్ లో పెట్టేస్తుంటారు. అవసరమైనప్పుడు వాడుకోవడానికి తీసుకుని దాన్ని కడిగి వాడుతుంటారు. ఈ సందర్భాలలో కొన్ని సార్లు అల్లం కుళ్లిపోవడం కూడా గమనించవచ్చు. అయితే అల్లం అలా పాడవకుండా ఉండాలంటే మార్కెట్ నుండి తీసుకురాగానే అల్లాన్ని శుభ్రంగా కడగాలి. అల్లానికి మురికి, మట్టి పోయేదాక కడిగి ఆ తరువాత పొడి గుడ్డతో తుడవాలి. గాలికి ఆరబెట్టిన తరువాత గాలి చొరబడని కంటైనర్ లో ఒక కాగితం పెట్టి అందులో అల్లాన్ని ఉంచి ఫ్రిడ్జ్ లో పెట్టాలి. ఇలా చేయడం వల్ల అల్లం నెలల తరబడి కూడా పాడవకుండా నిల్వ ఉంటుంది. అల్లాన్ని ఫ్రిడ్జ్ లో ఉంచినట్టు చాలామంది వెల్లుల్లిని కూడా ఫ్రిడ్జ్ లో ఉంచుతారు. ముఖ్యంగా బిజీ లైఫ్ లో ఉన్నవారు కూరగాయలను తీరక దొరికినప్పుడు కట్ చేసి ఫ్రిడ్జ్ లో పెడుతుంటారు. ఉదయాన్నే వంట, టిఫిన్ చేయడానికి చాలా సులువుగా ఉంటాయని అనుకుంటారు. కానీ ఇలా కూరగాయలు ముందే కట్ చేసి పెట్టుకోవడం కానీ, వాటితో పాటు వెల్లుల్లిని ముందే ఒలిచి ఫ్రిడ్జ్ లో నిల్వ చేసుకోవడం కాదు. వెల్లుల్లిని ఫ్రిడ్జ్ లో ఉంచితే మొలకలు వస్తాయి. పైగా వాటిని సరిగా నిల్వచేయకపోతే పాలు, పెరుగు సహా అన్ని పదార్థాలకు వెల్లుల్లి వాసన పట్టేస్తుంది. కాబట్టి వెల్లుల్లిని ఫ్రిడ్జ్ లో పెట్టకపోవడం మంచిది.





## రివాల్వర్ రీటా మిషన్ ఏంటో మరి

**టీజర్‌తో క్యూరియాసిటీ పెంచుతోన్న కీర్తిసురేశ్!**

మహానటి సినిమాతో నేషనల్ అవార్డ్ విన్నింగ్ బ్యూటీగా నిలిచింది కీర్తి సురేశ్ ఓ వైపు గ్లామరస్ పాత్రలతో పాటు పర్ ఫార్మెన్స్ ఓరియెంటెడ్ రోల్స్ చేస్తూ ఎంటర్‌టైన్ చేస్తున్న ఈ భామ తాజాగా రివాల్వర్ రీటాగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ చిత్రానికి జేకే చంద్రు దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. మేకర్స్ లాంచ్ చేసిన టీజర్.. రివాల్వర్ రీటాగా కీర్తి మార్క్ హ్యూమర్ టచ్‌తో యాక్షన్ పార్టుతో స్టన్నింగ్‌గా సాగుతుంది. టీజర్‌లో కీర్తి సురేశ్ మార్కెట్‌లో కూరగాయలు కొంటుండగా.. పాత అంబాసిడర్ కారులో ఉన్న దొంగలునుంచి ఆమెను చూస్తారు. కారులో కీర్తిసురేశ్ దగ్గరకు వచ్చి హ్యాండ్ బ్యాగ్‌ను లాక్కెళ్తారు. ఇంతకీ బ్యాగ్‌లో ఏముందోనని ఓపెన్ చేసి చూడగా.. రక్తపు మరకలతో ఉన్న కత్తితోపాటు కొంత నగదును కనిపిస్తుంది. ఇంతలోనే దొంగలున్న గోదాంకు కీర్తిసురేశ్ కూరగాయల బ్యాగ్‌తో వస్తుంది. ఇంతకీ మీరు రా ఏజెంటా అని కీర్తిసురేశ్‌ను దొంగలు అడిగితే.. కాదు అని చెప్తుంది. మధ్యలో కీర్తిసురేశ్ స్టైలిష్ యాక్షన్ పార్ట్ సీక్వెన్స్ ఉంటుంది. ఇంతలోనే రాధికా శరత్కుమార్ (తల్లి) కీర్తిసురేశ్‌కు ఫోన్ చేసి కూరగాయలతో త్వరగా రమ్మని చెప్తుంది. ఇంతకీ కీర్తిసురేశ్ రివాల్వర్ రీటాగా మారడానికి కారణమేమై ఉంటుంది.. రివాల్వర్ రీటా ఏదైనా మిషన్‌లో పాల్గొంటుందా.. ? అనేది సస్పెన్స్ లో పెడుతూ కట్ చేసిన టీజర్ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది.

## 15 ఎకరాల్లో భారీ సెట్



హీరో శర్వానంద్ ఇటీవలే తన తొలి పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'శర్వా38'ని అనౌన్స్ చేశారు. సంపత్ నంది దర్శకత్వంలో ఈ మూవీని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ ప్రొడక్షన్ నెం. 15గా నిర్మించనున్నారు. లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. 1960లో ఉత్తర తెలంగాణ, తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు లోని రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పల్సేటింగ్ పీరియడ్ యాక్షన్ డ్రామాతో ఈ సినిమాని రూపొందిస్తున్నారు. బుధవారం చిత్ర బృందం భూమి పూజతో సెట్ వర్క్‌ను ప్రారంభించింది. ఉత్తర తెలంగాణ స్వరూపాన్ని, ఆ ప్రపంచాన్ని, కల్చర్‌ని రీక్రియేట్ చేసే మ్యాసీవ్ సెట్‌ని హైదరాబాద్ సమీపంలోని 15 ఎకరాల విస్తీర్ణంలో హై బడ్జెట్‌తో ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మన్నె రూపొందించారు. ఈ సెట్‌లో కొన్ని అద్భుతమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. అలాగే మునుపెన్నడూ చూడని పాత్రలో శర్వానంద్ కనిపించ నున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. శర్వానంద్, సంపత్‌నంది వంటి డిఫరెంట్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌పై అందరిలోనూ భారీ అంచనాలు ఉన్నాయి. పైగా ఇది 1960 బ్యాక్‌డ్రాప్ కావడంతో మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది. ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా నిర్మాత కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఓ సరికొత్త నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఓ మంచి అనుభూతిని అందిస్తుందనే నమ్మకాన్ని చిత్ర బృందం వ్యక్తం చేసింది. ఈ చిత్రానికి డీవోపీ: సౌందర్ రాజన్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఆర్ట్ డైరెక్టర్: కిరణ్ కుమార్ మన్నె.

## రాకింగ్ రాకేష్ 'కేసీఆర్' ట్రైలర్ అప్‌డేట్

జబర్దస్త్ ఫేమ్, నటుడు రాకింగ్ రాకేశ్ కథానాయకుడిగా నటిస్తూ.. నిర్మిస్తున్న తాజా చిత్రం 'కేసీఆర్' (కేశవ చంద్ర రమావత్). ఈ సినిమాకు 'గరుడ వేగ' అంజి దర్శకత్వం వహిస్తుండగా.. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రానుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి 'తెలంగాణ తేజం' అంటూ సాగే పాటను తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇప్పుడు మూవీ నుంచి తాజాగా ట్రైలర్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా ట్రైలర్‌ను రేపు ఉదయం 10.30 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. చరణ్ అర్జున్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు లిరిక్స్ గోరేటి వెంకన్నతో పాటు కాసర్ల శ్యామ్ అందిస్తున్నారు.



## యాక్షన్ అవతార్‌లో సమంత

బాలీవుడ్ యాక్టర్ వరుణ్ ధవన్, సమంత కాంబినేషన్‌లో వస్తోన్న వెబ్ ప్రాజెక్ట్ సిటడెల్ సిటడెల్ ఇండియన్ వెర్షన్‌గా వస్తున్న ఈ వెబ్ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ట్రైలర్ ఇంప్రెసివ్‌గా సాగుతూ క్యూరియాసిటీ పెంచేస్తుంది. సిటడెల్ నవంబర్ 7న పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియోలో తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ప్రీమియర్ కానుంది. తాజాగా సిటడెల్ వర్కింగ్ స్టిల్స్ నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. సామ్ మరోసారి ఇంటెన్స్ అవతార్‌లో అలరించబోతున్నట్టు స్టిల్స్ హింట్ ఇచ్చేస్తున్నాయి. స్టంట్‌మ్యాన్ బన్నీ, హనీ చుట్టూ తిరిగే కథాంశంతో ఫన్నీ, ఇంటెన్స్ యాక్షన్ సీక్వెన్స్‌లు, అద్భుతమైన విజువల్స్‌తో వెబ్ ప్రాజెక్ట్ ఉండబోతున్నట్టు ట్రైలర్ చెప్పకనే చెబుతోంది. రాజ్-డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్టులో కేకే మీనన్, సిమ్రన్, సోహం మజుందార్, శివంకిత్ పరిహార్, కశ్వీ మజుందార్, సాఖిబ్ సలీం, సికిందర్ ఖేర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సిటడెల్‌ను రాజ్%డ% డీకే %ణ2= ఖీఅశ్రీఎం% బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు రాజ్%డ%డీకే, సీతా మీనన్ కథనందించారు.



## శరీరం చెప్పిన మాట వినండి?

సినీ సెలబ్రిటీలకు సోషల్ మీడియాలో ఏ రేంజర్ క్రేజ్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. మరీ ముఖ్యంగా హీరోయిన్ల గురించి అయితే తెలుసుకునేందుకు అభిమానులు అందరూ కూడా ఎంతగానో ఆసక్తిని కనపరుస్తూ ఉంటారు. హీరోయిన్లు కూడా అభిమానులకు దగ్గరగా ఉంటూ ఎప్పుడు తమ అప్డేట్లను చెబుతూ ఉంటారు. కొంతమంది హాట్ ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఫ్యాన్స్ అందరికీ కిక్కెక్కిస్తూ ఉంటారు అన్న విషయం తెలిసిందే. అందుకే అటు సోషల్ మీడియాలో హీరోయిన్లకు మిలియన్ల మంది ఫాలోవర్లు ఉండడం కూడా చూస్తూ ఉంటాం. అందుకే ఇక ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ గా ఎదిగిన వారి గురించి ఏదైనా మ్యాటర్ ఇంటర్నెట్ లోకి వచ్చిందంటే చాలు అది కాస్త వైరల్ గా మారిపోతూ ఉంటుంది. ఆ విషయం గురించి తెలుసుకునేందుకు అందరూ ఆసక్తిని కనబరుస్తూ ఉంటారు అని చెప్పాలి. అయితే ఇటీవల స్టార్ హీరోయిన్రకుల్ ప్రీత్ సింగ్ గురించి ఒక ఇంట్రెస్టింగ్ న్యూస్ ఇంటర్నెట్లో చక్కర్లు కొడుతుంది. ఇటీవలే రకుల్ జిమ్ లో వర్కౌట్ లు చేస్తున్న సమయంలో గాయపడింది అన్న విషయం తెలిసిందే. ఏకంగా 80 కేజీల బరువు ఎత్తుతున్న సమయంలో ఆమె వెన్నుముకకు గాయమైంది. అయితే గాయమైన వెంటనే హాస్పిటల్కు వెళ్లకుండా నొప్పిని లెక్క చేయకుండా షూటింగ్స్ లో పాల్గొంటూ వచ్చింది రకుల్ ప్రీత్ సింగ్. దీంతో ఇక గాయం తీవ్రతరం కావడంతో చివరికి ఆసుపత్రి పాలు అయింది ఫలితంగా ఆరు రోజులుగా ఆమె మంచానికే పరిమితమైంది. అయితే ఇక ఇదే విషయం గురించి ఇటీవలే మాట్లాడిన రకుల్ ఆసక్తికర విషయం చెప్పుకొచ్చింది. నా శరీరం చెప్పిన మాట వినకుండా నేను బరువులు ఎత్తి స్టుపిడ్ పనిచేశాను. చివరికి ఇలా మంచాన పడ్డాను. కానీ మీరు మాత్రం మీ శరీరం చెప్పిన మాట వినండి. శరీరం చెబితే దాన్ని అస్సలు అశ్రద్ధ చేయవద్దు అంటూ రకుల్ అభిమానులకు ఒక సూచన చేసింది.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110